

రేపు వైఎస్ జయంతి వేడుకలు

శ్రీకాకుళం అర్బన్ : మాజీ ముఖ్యమంత్రి కీ.శే వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఈనెల ఎనిమిదో తేదీన జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, చెట్లు నాటే కార్యక్రమం, పిల్లలకు పుస్తకాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు గొండు కృష్ణమూర్తి, శిమ్మ రాజశేఖర్, రౌతు శంకరరావు, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి 'ఉచిత ఇసుక' అమలు

- అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేయాలి
- టెక్కలి, అంగూరు స్టాక్ పాయింట్లు స్వాధీనం చేసుకోవాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని ఈనెల ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాల నివారణ కోసం నిర్దేశించిన టోల్ ఫ్రీ నంబర్లు 1800 425 6012, 08942-293229, 9701691657 నంబరుకు వాట్సాప్ ద్వారా గానీ Dmgosklmsandcomplaints@myyahoo.com మెయిల్‌కు ఫొటోలు, వీడియోల సహాయంతో ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిషేధించడానికి టోల్‌ఫ్రీ నంబర్లపై పెద్దఎత్తున ప్రచారం చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ఆయా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇసుక విషయంలో ఉల్లంఘనలకు పాల్పడే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను లెక్కించి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇసుక డిపోలో ఉన్న ఇసుక అమ్మకం రేటు అంగూరు, టెక్కలి స్టాక్ పాయింట్‌లో మెట్రిక్ టన్ను రూ.340గా కమిటీ నిర్ణయించింది. రెవెన్యూ నుంచి విఆర్‌ఒ, భూగర్భ గనుల శాఖ నుంచి టెక్నికల్ అసిస్టెంట్, పోలీసు శాఖ నుంచి కానిస్టేబుల్ స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు స్టాక్ పాయింట్ నుంచి ఇసుక పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాయింట్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. యుపిఐ ద్వారా చెల్లింపులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇసుక తీసుకున్న వినియోగదారులకు రశీదు ఇవ్వాలని స్పష్టం చేశారు. టెక్కలి పాయింట్ వద్ద ఎనిమిది వేల మెట్రిక్ టన్నులు, అంగూరు పాయింట్ వద్ద 40 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉందన్నారు. మొదట ప్రాధాన్యత ట్రాక్టర్‌కు ఇసుక లోడు చేయించాల్సి ఉందన్నారు. ఆరు టైర్ల లారీలు తర్వాత మాత్రమే లోడింగ్‌కు అనుమతించాలన్నారు. ముందుగా గృహ నిర్మాణాలు, తర్వాత బిల్డర్లకు ఇసుక సరఫరా చేస్తామన్నారు. బూర్జ మండలం నారాయణపురం అనకట్ట వద్ద డీ సిల్టేషన్ కోసం ఇరిగేషన్ జెఈ తనిఖీ చేసి పర్యావరణ, మైనింగ్ ప్లాన్‌లు తయారు చేసి సిటిఇ, సిటిఒను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లాలో డీ సిల్టేషన్ పాయింట్ లభ్యతను పరిశీలించాలని తెలిపారు. ట్రోల్ ఫ్రీ నంబరు పెట్టి అక్కడ ఒకరిని ఉంచి వారికి అవగాహన కల్పించాలని మైన్స్ డీడీని ఆదేశించారు. పాయింట్ల వద్ద విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, ఎస్‌ఇబి ఎఎస్‌పి గంగాధర్, భూగర్భ శాఖ ఉప సంచాలకులు ఎస్.కె.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కెజిబివి విద్యార్థినులకు అస్వస్థత

20 మందికి డయేరియా

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండల కేంద్రంలోని కెజిబివిలో 20 మంది విద్యార్థినులు శనివారం అతిసారతో అస్వస్థతకు గురయ్యారు. కెజిబివిలో 280 విద్యార్థినులు చదువుతున్నారు. శుక్రవారం నుంచి విద్యార్థినులకు విరోచనాలు, వాంతులు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు తిలారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందజేశారు. వైద్యులు మనీష, హెల్త్ అసిస్టెంట్ ఎస్.యోగేశ్వరరావులు సిబ్బందితో కలిసి పాఠశాలలో రెండు రోజులుగా వైద్య శిబిరం నిర్వహించారు. అయినా అతిసార అదుపులోకి రాలేదు. వ్యాధి తీవ్రతరం కావడంతో శనివారం స్థానిక సామాజికి ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినులు కాలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వల్లనే అతిసారకు గురయ్యారని వైద్యులు తెలిపారు. డి.ప్రియ, ఆర్.బాసిత, డి.ఉమా, జి.జగదీ, బి.జోసిత, వై.మేఘన, ఎస్.త్రిష, శారణ్య, సోనియాలతో పాలు 20 మంది అతిసారతో బాధపడుతున్నారు. వీరిని బాలికల చైల్డ్ డెవపల్‌మెంట్ (జిసిడిఒ) ఎస్.నీరజ పరామర్శించారు. పాఠశాలలో తాగునీటి ట్యాంకు శుభ్రపర్చకపోవడం, పరిసర ప్రాంతాలు శుభ్రంగా లేకపోవడం, నాణ్యమైన ఆహారం అందికపోవడం వల్లనే తమ పిల్లలు ఈ వ్యాధి బారిన పడ్డారని తల్లిదండ్రులు ఆస్పత్రి వద్ద లబోదిబోమంటున్నారు. దీనిపై అధికారులు స్పందించి విద్యార్థినులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.


మాట్లాడుతున్న జెసి నవీన్

ధరల నియంత్రణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో నిత్యావసర సరకుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా వ్యాపారులు, డీలర్లు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కోరారు. కలెక్టరేట్‌లో హోల్‌సేల్ డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. నిత్యావసర సరుకులైన బియ్యం, పప్పులు, ఆయిల్, పంచదార ధరల రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అందుకు గల కారణాలపై సమీక్షించారు. ముందుగా పప్పులు హోల్‌సేల్, రిటైల్ ధరలపై డీలర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీలర్లు, వినియోగదారులు నష్టపోకుండా ధరల తగ్గించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సామాన్యులకు ధరలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ పోర్టల్‌లో ప్రతిఒక్క డీలరూ తప్పక ఉండాలన్నారు. సరుకులు అక్రమంగా నిల్వచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోల్‌సేల్ డీలర్లతో ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కంది పప్పు ధర తగ్గించి ప్రభుత్వం తరుపున విక్రయాలు చేపట్టేందుకు జిల్లాలో షాపులను గుర్తిస్తామన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి బి.శాంతిశ్రీ, సివిల్ సప్లయి కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాసరావు, మార్కెటింగ్ ఎడి జె.ఎస్.నాగలక్ష్మిజ్యోతి పాల్గొన్నారు.


ఒడిశా రాష్ట్రం పూరీలో జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని జగన్నాథస్వామి అన్న బలభద్రుడు చెల్లెలు సుభద్రతో కూడిన సైకత శిల్పాన్ని సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేశారు. మండలంలోని గాజుల కొల్లివలస పంచాయతీ పరిధిలోని సంగమేశ్వర స్వామి కొండ దిగువన వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

సమస్యలు పరిష్కరించకుంటే ఉధృత పోరాటాలు



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలను ఉధతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు హెచ్చరించారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘ జిల్లా విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల పదో తేదీన అఖిల భారత కోర్కెల దినాన్ని పురస్కరించుకుని పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజిన్‌ను ఏర్పాటు చేసి పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ యాజమాన్యం 30 ఏళ్ల సర్వీసు పూర్తయిన కార్మికులను అన్యాయంగా విధుల నుంచి తొలగించిందని, వారిని తక్షణమే విధులలోకి తీసుకోవడంతో పాటు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. నీలం జ్యూట్ పరిశ్రమను వెంటనే తెరిపించాలన్నారు. యునైటెడ్ బ్రేవరీస్, రెడ్డీస్ లేబొరేటరీస్, అరబిందో, మందస రైస్‌మిల్లు కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. రిమ్స్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించి ఇపిఎఫ్, ఇఎస్‌ఐ క్రమబద్ధీకరించాలన్నారు. గ్రానైట్ పరిశ్రమను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన పథకం, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర స్కీమ్‌ల వారీగా కార్మికులను ప్రభుత్వం గుర్తించి కనీస వేతనాలు చెల్లించడంతో పాటు పెన్షన్, సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎలకు టైమ్ స్కేల్ అమలు చేసి అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, కంటింజెంట్, పార్ట్ టైమ్, గెస్ట్ తదితర ఉద్యోగ, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇచ్చి వారిని రెగ్యులర్ చేయాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కె.సూరయ్య, ఎన్.వి రమణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, జి.అమరావతి, బి.ఉత్తర, ఆర్.ప్రకాష్, పి.లతాదేవి, ఎన్.బలరాం తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ రాజీనామా

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఆర్‌జియుకెటి పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.జి.డి బాలాజీ తన పదవికి శనివారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డికి ఈ-మెయిల్‌లో పంపించారు. ఆయన గతేడాది నవంబరు 18వ తేదీన ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. వైసిపి ప్రభుత్వంలో ట్రిపుల్ ఐటి డైరెక్టర్‌గా నియమితులైన ఆయన, టిడిపి ప్రభుత్వం కొలువుదీరాక వచ్చిన ఒత్తిళ్ల నేపథ్యంలో ఆయన రాజీనామా చేసినట్లు సమాచారం.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలి

శ్రీకాకుళం : జిల్లాలో వరి తర్వాత ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ తదితర అనుబంధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయం, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణ వివరాలపై ఆరా తీశారు. పామాయిల్ వెయ్యి హెక్టార్లలో, జీడి, కొబ్బరి వెయ్యి హెక్టార్లలో ఉన్నట్లు ఉద్యానశాఖ ఎడి ప్రసాదరావు తెలిపారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటలు ఉండవని, రబీలో ప్రత్యామ్నాయ రెండో పంటగా మొక్కజొన్న సుమారు 25 వేల హెక్టార్లకు పెంచుతామని వ్యవసాయశాఖ జెడి శ్రీధర్ చెప్పారు. పామాయిల్ పంట వ్యవసాయ ప్రాంతం నుంచి ఉద్యాన పంటగా మారుస్తామన్నారు. పామాయిల్ పంటను ఉపాధి హామీకి అనుసంధానం చేయాలని, అలా అయితే మూడేళ్ల వరకు నిర్వహణ ఉంటుందని వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, ఎపిఎంఐపి డీడీ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ ఎడి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల మరమ్మతులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న గొండు శంకర్

శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలోని ఎత్తిపోతల పథకాలు, కాలువల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో శివారు భూముల రైతాంగానికి సైతం ఖరీఫ్‌కు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందులో భాగంగా పలు ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. పలుచోట్ల కాలువలు బాగు చేయాల్సి ఉందన్నారు. రైతాంగం సమస్యలను దృష్టిలో పెట్టుకుని తన అభ్యర్థన మేరకు తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పక్కదారి పట్టిన ఎరువుల సంగతేంటి?

ఎమ్మెల్యే బెండాళం అశోక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి - కవిటి

2022లో కంచిలి పిఎసిఎస్ ద్వారా తెప్పించిన ఎరువుల వ్యవహారంపై ఎమ్మెల్యే బెండాళం అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఫిర్యాదులు వచ్చినా ఎందుకు పట్టించుకోలేదని, మండలంలో వ్యవసాయాధికారికి సమాచారం లేకుండానే వ్యవహారం చేశారంటే మండలంలో ఏం జరుగుతోందని విస్మయం వ్యక్తం చేశారు. తక్షణమే దీనిపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించి, విచారణ చేపట్టాలని ఆదేశించారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో శనివారం వ్యవసాయ శాఖపై సమీక్షించారు. 'కంచిలి పిఎసిఎస్ ద్వారా వచ్చిన ఎరువులు వ్యవసాయశాఖ అధికారులకు తెలియకుండానే రైతులకు అందజేశారా?. పిఎసిఎస్ ద్వారా రైతుల కోసం తెప్పించిన ఎరువులు పక్కనే ఉన్న ఒడిశాలో డంప్ చేసి మళ్ళీ ఆ రైతులకే అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? సదరు వ్యక్తులు, సంస్థలకు నోటీసులు ఇచ్చి నెలలు గడిచినా తదుపరి చర్యలు తీసుకోకుండా ఎందుకు నీళ్ల నములుతున్నారు' అని ఎడిఎ జగన్మోహనరావు, కంచిలి ఎఒ ధనుంజయను ప్రశ్నించారు. విత్తనాల పంపిణీలో ఎటువంటి అశ్రద్ధ వద్దని ముందస్తుగానే అవసరమైన ఇండెంట్ తీసుకొని సమయానికి రైతులకు సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకమైనా ప్రతి రైతుకు చేరాలన్నారు. పంట దిగుబడి, కరువు మండలాల గుర్తింపులో పక్కాగా వ్యవహరించాలని, భౌగోళిక పరిస్థితుల దష్ట్యా వ్యత్యాసం చూపిస్తూ రైతులకు అన్యాయం చేయొద్దని సూచించారు. ఈ-క్రాప్ విషయంలో అశ్రద్ధ వద్దన్నారు. ఎడిఎ జగన్మోహనరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో జిల్లాలో సోంపేట, కవిటి మండలాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్టు తెలిపారు. సమావేశంలో ఎఒలు బి.నరసింహమూర్తి, తిలక్ వర్మ, ధనుంజయ, భార్గవి, విఎఎ కళ్యాణ్ పాల్గొన్నారు.

డిజిటల్ స్కామ్‌లపై అప్రమత్తం


ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

డిజిటల్ స్కామ్‌లపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో సూచించారు. సైబర్ నేరగాళ్లు చేసే నకిలీ కొరియర్ల అవకతవకలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ మధ్యకాలంలో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి పోలీస్ అధికారిగా, సిబిఐ అధికారిగా, కస్టమ్స్ అధికారిగా పరిచయం చేసుకుని మీ పేరు మీద వచ్చిన కొరియర్‌లో అక్రమ ఆయుధాలు, మాదకద్రవ్యాలు ఉన్నాయని, దాని కారణంగా మీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్తున్నారని తెలిపారు. స్కైప్ ద్వారా వీడియో కాల్ కనెక్ట్ కావాలని చెప్పి సైబర్ నేరగాళ్లు పోలీస్ యూనిఫారంలోనే ఉంటూ మీ మీద కేసు లేకుండా చేయాలంటే పెద్ద మొత్తంలో డబ్బు తమ ఖాతాలోకి జమ చేయాలని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. కనీసం మిమ్మల్ని వేరే వాళ్లతో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వరని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో ఈ రకమైన నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున ఎవరూ ఇటువంటి కాల్స్‌కు స్పందించకూడదని తెలిపారు. విదేశాల్లో ఉన్న మీకు సంబంధిచిన వాళ్లు డ్రగ్స్, హవాలా కేసుల్లో దొరికిపోయారని మీకు ఎవరైనా కాల్ చేసి చెప్తే ముందుగా మీ వాళ్ళకు కాల్ చేసి నిర్ధారించుకోవాలని పేర్కొన్నారు. అటువంటి వాటిని నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆర్థిక లావాదేవీలపై మీకు ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే, వెంటనే మీ సమీపంలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. మీ వ్యక్తిగత సమాచారం కోసం పోలీసులు ఎప్పుడూ ఫోన్‌లో సంప్రదించరని స్పష్టం చేశారు. వ్యక్తిగత, ఆర్థికపరమైన సమాచారాన్ని ఫోన్‌లో ఎవరికీ చెప్పవద్దని తెలిపారు. ఒకవేళ మీరు సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబరుకు కాల్ చేయడం గానీ www.cyber-crime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

నెరవేరిన రాజకీయ పంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



వృద్ధులకు పింఛన్ అందించే క్రమంలో ఉదయం ఆరు గంటల కల్లా అందరికీ ఒకే రోజు ఇచ్చి తన ఘనత చాటుకోవాలని కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం పరితపించింది. వాలంటీర్లు లేకుండానే సచివాలయ ఉద్యోగులతో ఒక్క రోజులోనే 97 శాతం మేర పంపిణీ పూర్తి చేసి తన రాజకీయ పంతాన్ని నెరవేర్చుకుంది. ఈ విషయంలో ప్రభుత్వాన్ని, అధికారులు, ఉద్యోగులను అభినందించాల్సిందే. ఎన్నికల సమయంలో ఫింఛన్ల పంపిణీలో కూటమి, వైసిపి మధ్య దీనిపై పెద్ద రచ్చే జరిగింది. వాలంటీర్లతో పింఛన్లు అందిస్తే, అది వారు ఓటర్లను ప్రభావితం చేస్తారనే ఉద్దేశంతో కూటమి నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం, వాలంటీర్లను పంపిణీకి దూరంగా ఉంచాలని ఆదేశించడం తెలిసిందే. కూటమి నాయకుల ఆలోచనలకు విరుగుడుగా అప్పటి వైసిపి ప్రభుత్వం సచివాలయాల ద్వారా ఏప్రిల్ ఫించన్ సొమ్ము అందించాలని నిర్ణయించింది. దీంతో వృద్ధులు, వికలాంగులు పడరాని కష్టాలు పడడం చూశాం. టిడిపిని లబ్ధిదారుల ఆగ్రహానికి గురిచేసి తద్వారా ప్రయోజనం పొందాలని వైసిపి ప్రభుత్వం చూసింది. సచివాలయ ఉద్యోగుల ద్వారా మే నెలలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఫించన్ అందించేలా చూడాలని అప్పటి సిఎస్ జవహర్‌రెడ్డికి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. రోగులకు, నడవలేని వారికి మాత్రమే ఇళ్లకు వెళ్లి మిగిలిన లబ్ధిదారులకు వారి ఖాతాల్లో సొమ్ములను జమ చేశారు. మండుటెండలోనే బ్యాంకులకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. గంటల తరబడి క్యూలో నిల్చొని తీవ్ర అవస్థలు పడ్డారు. జూన్ 12న కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో జూలైకు సంబంధించి ఫించన్లను ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఇంటికే వెళ్లి అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి గ్రామస్థాయి నాయకుడు వరకు, కలెక్టర్ నుంచి సచివాలయ ఉద్యోగి వరకు ఇంటింటికీ ఫించన్ సొమ్ము అందించారు. వాలంటీర్లు లేకపోతే ఇంటింటికీ పింఛన్ ఇవ్వలేమని అప్పటి ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో చేతకాకపోతే రాజీనామా చేసి వెళ్లిపోవాలని, తాను ఒక్క రోజులో పంపిణీ చేసి చూపిస్తానంటూ చంద్రబాబునాయుడు పలు బహిరంగ సభల్లో సవాల్ సైతం విసిరారు. క్షేత్రస్థాయిలో అది చేసి చూపించారు. పలురకాల పింఛన్ల సొమ్మును పెంచడంతో పాటు వృద్ధాప్య, వితంతు పింఛన్ మూడు నెలల బకాయిలనూ అందించడాన్ని అభినందించాల్సిందే. ఇదే సందర్భంలో అన్నిరకాల ఫించన్ల మొత్తాన్ని పెంచిన కూటమి ప్రభుత్వం, పింఛను లబ్ధిదారుల సంఖ్య పెంపుపై మాత్రం ఎటువంటి ప్రకటన చేయకపోవడం కొంత నిరాశపరిచింది.

పింఛన్లను పొందడానికి గత ప్రభుత్వం రకరకాల ఆంక్షలను విధించింది. నిబంధనల పేరుతో పింఛన్లను కుదించే పనిచేసింది. ప్రభుత్వం ద్వారా ఏడాదికి కనీసం రూ.10 వేలు ఆదాయం పొందే వారిని అనర్హులుగా చేసింది. వీరిలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. కుటుంబసభ్యుల్లో ఏ ఒక్కరైనా రూ.10 వేలు జీతం పొందిన వారుంటే అప్పటివరకు ఇస్తున్న ఫించన్‌ను నిలిపేశారు. కరెంట్ బిల్లు, మూడు ఎకరాల భూమి, పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నిర్దేశించిన వైశాల్యం కంటే సొంత ఇల్లు ఉంటే వారిని అనర్హులను చేసింది. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ సమీక్ష చేస్తున్న కూటమి ప్రభుత్వం, పింఛన్ల పంపిణీ అర్హతలపై ఒక నిర్ణయం తీసుకుంటే మరింత మంది పేదలకు ప్రయోజనం చేకూరనుంది.

రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంలో గ్రామాల్లో చిరుద్యోగులకు వేధింపులు మొదలయ్యాయి. ఇటీవలి ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా పనిచేశారనో, తమకు ఓటు వేయలేదన్న కారణాలతో అప్పుడే రాజకీయ ఒత్తిళ్లు మొదలయ్యాయి. మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు రాజకీయ కక్షతో తమను తొలగించాలని చూస్తున్నారంటూ 'మీ కోసం'లో ఫిర్యాదులు వస్తున్నాయి. ఐదేళ్ల కిందట ఇవేరకమైన ఫిర్యాదులు చూశాం. ఏడాది పాటు ఫిర్యాదుల పరంపర కొనసాగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఈరకమైన ఫిర్యాదులు వస్తున్నాయి. తమ ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందోనన్న భయం చిరుద్యోగులను వెంటాడుతోంది. తమను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం చెల్లించాలని గత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. కూటమి ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేర్చే ప్రయత్నం మాని వారిని ఏకంగా ఉద్యోగుల నుంచి తీసేయాలని చూడడం గమనార్హం. పాలకులు మారినా, వారి విధానాలు మారవనడానికి చిరుద్యోగులపై వేధింపులే ఒక ఉదాహరణ.

నీట్, నెట్ పరీక్ష పత్రాల లీకేజీపై విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుంచి మంచి స్పందన వ్యక్తమైంది. దేశమంతటా దీనిపై విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహం నెలకొన్న నేపథ్యంలో అది జిల్లాలోనూ కనిపించింది. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి తమ సంఘీభావం తెలిపారు. విద్యార్థి సంఘాల బంద్‌కు గానీ, నీట్ పరీక్షల్లో అవకతవకలపై గానీ టిడిపి, వైసిపి పార్టీలు, ఆ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘాలు కనీసం నోరు మెదపలేదు. అరకు కాఫీపై మోడీ ప్రశంసలపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు జైరాం రమేష్ చేసిన ట్వీట్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి కౌంటర్ ఇచ్చారు. మోడీ ప్రభుత్వ లీకేజీ ఘటనపై అదే మంత్రి నోరు మెదకపోవడం విద్యార్థులపై వీరి ప్రేమ ఎంతపాటిదో తెలుస్తోంది. ప్రతిపక్ష వైసిపి కూడా మౌనంగా ఉండడం ఆశ్చర్యకలిగిస్తోంది. కూటమి ప్రభుత్వ నిర్వాకాలను ఎండగట్టాల్సిన వైసిపి ఆ అవకాశాన్ని వదులుకుంది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి మద్దతు పలకడం గత ఐదేళ్ల నాటి పరిస్థితులు పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది.


జడ్జికి మొక్కను అందజేస్తున్న కలెక్టర్

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానాను కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం ఆయన ఛాంబరులో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు జిల్లా జడ్జి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థితిగతులు, శాంతి భద్రతల పరిస్థితి తదితర అంశాలపై ముచ్చటించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

యువతకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రాంగణంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ ఏ వ్యక్తి నిరాశ చెందకూడదన్నారు. ఉపాధి, ఉద్యోగం ఎక్కడ వచ్చినా ముందుకు వెళ్లాలని సూచించారు. యువత ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఇష్టపడడం లేదన్నారు. రాబోయే రోజుల్లో భారీ ఎత్తున జాబ్ మేళాలు నిర్వహించి నియోజకవర్గస్థాయిలో ప్రతి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. సిఎంఎఫ్ లేబరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ జి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఫార్మ రంగానికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున దానికి అనుకూలమైన కోర్సులు చదువుకోవాలని వివరించారు. హైదరాబాద్, అచ్యుతాపురం, పరవాడ, పైడిభీమవరం పారిశ్రామిక అభివృద్ధి చెందుతున్నాయని, రానున్న రోజుల్లో యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు జరుగుతాయన్నారు. ఈ జాబ్‌మేళాలో 500 మంది యువతీ, యువకులు పాల్గొనగా 116 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో సిఎంఎఫ్ డైరెక్టర్ ఐ.శ్రీనివాసరావు, రిక్రూట్మెంట్ హెడ్ విజయ్ కృష్ణ, స్కూల్ డైరెక్టర్ తేజబాబు, ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్ కుమార్, స్కూల్ ప్రెసిడెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనార్ధనరావు, ఉపాధ్యాయులు

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

జన విజ్ఞానవేదిక (జెవివి)లో చేరి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్దనరావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవుడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధిని సాధిస్తూ అంతరిక్షంలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్న నేటి తరుణంలో కొంతమంది మూఢ నమ్మకాలతో తమ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో హత్రాస్‌లో బోలో బాబా పాద ధూళి కోసం జరిగిన తొక్కిసలాటలో 121 మంది ప్రాణాలు కోల్పోయారని, ఈ సంఘటన అమానుషమన్నారు. ఇప్పటికైనా ప్రజలు మూఢనమ్మకాలకు స్వస్తి పలికి శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బొడ్డేపల్లి రామకృష్ణ, జెవివి నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, కె.షణ్ముఖరావు, బెండి సూర్యనారాయణ, మెండ శ్యామలరావు, చింతాడ వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

సరుబుజ్జిలి: ప్రతి మహిళ తీసుకున్న రుణాలను అవసరం మేరకు ఖర్చు చేయాలని, అలాగే జీవనోపాధి మెరుగుపర్చుకోవాలని, తీసుకున్న రుణంతో లక్షాధికారులు కావాలని డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ఎపిఎం పి.కమలకుమారి అధ్యక్షతన జరిగిన మండల మహిళా సమైక్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న బ్యాంకు రుణాలు సిఐఎఫ్ శ్రీనిధి అప్పులు తీసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. చిన్న సంఘాల పుస్తక నిర్వహణ, గ్రామ సంఘాల సమావేశాలు విధిగా షెడ్యూల్ ప్రకారం జరగాలన్నారు. ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సమస్యలు రావన్నారు. విత్తన శుద్ధి ఎలా చేయాలో, ప్రకృతి వ్యవసాయం మెళకువలు తెలియజేశారు. కార్యక్రమంలో జీవనోపాధుల డిపిఎం బి.నారాయణరావు, డిపిఎం ఐబి కె మోహనరావు, ఎల్ సి రామచంద్రరావు, శ్రీనిధి మేనేజరు లక్ష్మణరావు, అధ్యక్షురాలు బి.చామంతి, సిసిలు పాల్గొన్నారు.


విత్తన శుద్ధిపై మెళకువలను వివరిస్తున్న పీడీ కిరణ్ కుమార్

తాగునీటి కష్టాలు తీరేదెప్పుడు?

- చెరువు నీరే జీవనాధారం
- అర్ధాంతరంగా నిలిచిన జలజీవన్ మిషన్
- తాగునీటి సౌకర్యంపై పెద్దల పెత్తనం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని విజయరాంపురం గ్రామ పంచాయతీ కూనజమ్మన్నపేటలో గడచిన కొన్ని దశాబ్దాల నుంచి అక్కడి ప్రజలు ఉప్పునీటి సమస్యతో సతమతమవుతున్నారు. అక్కడ ప్రజలకు చెరువు నీరే తాగునీరుగా జీవనాధారమైంది. గ్రామంలో ప్రభుత్వాలు తాగునీటి బావులు, బోర్లు ఏర్పాటు చేసినా ప్రజలు వారి వ్యక్తిగత తాగునీటి వసతులు కల్పించు కున్నప్పటికీ కూనజమ్మన్నపేట, కొత్తపేట గ్రామాల్లో ఎక్కడ చూసినా ఉప్పునీరే లభించడంతో గ్రామ ప్రజలు చెరువు నీరుపైనే ఆధారపడుతున్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంశధార నదిలో ఇసుక తవ్వకాల కాంట్రాక్టర్‌గా వచ్చిన ఒక వ్యక్తి ఈ గ్రామ తాగునీటి సమస్యను తెలుసుకొని సరుబుజ్జిలి కెజెపేట గ్రామాల మధ్య తాగునీటి బోరు ఏర్పాటు చేసి గ్రామానికి పైపులైన్లు వేయడం జరిగింది. అప్పట్లో జిల్లా ఎంపీ కిల్లి కృపారాణి కూడా కెజెపేట గ్రామానికి తాగునీరు అందించడానికి ప్రత్యేక నిధులతో మరో బోరు ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఈ పైపులైను నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో


అర్ధాంతరంగా నిలిచిన పైపులైన్ పనులు

మళ్లీ ఆ గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైన కూన రవి కుమార్ సుమారు రూ.పదిలక్షలు మంజూరు చేసి కొత్త పైపులైను ప్రతి 10 ఇళ్లకు ఒక వీధి కొళాయి, కొత్తగా బోరు బావి ఏర్పాటు చేసి నేటికీ ఆ గ్రామంలో తాగునీరు అందిస్తున్నారు. అయితే గ్రామంలో ఇరు పార్టీలకు చెందిన పెత్తందారులు ఇరువురు వ్యక్తులు పైపులైన్ ద్వారా వస్తున్న తాగునీటి కుళాయిలకు వ్యక్తిగత మోటార్లు ఏర్పాటు చేసి తమ గృహ అవసరాలకు వినియోగించుకున్న అనంతరం వారి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కొళాయిని ప్రజలు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో దిక్కుతోచని గ్రామ ప్రజలు ఒక్కసారి తాగునీటి కోసం చేరుకోవడంతో రద్దీ ఏర్పడి మహిళలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంఘటనలు ప్రతిరోజు నిత్యకృత్యంగా మారాయని మండల తెలుగు యువత నాయకులు గండెం రవికుమార్ ఆవేదన వెలిబుచ్చారు. ఇటీవల వైసిపి ప్రభుత్వం కెజెపేట, కొత్తపేట గ్రామాలకు సుమారు రూ.43 లక్షల వ్యయంతో జలజీవన మిషన్ ద్వారా


కెజెపేటలో మంచినీటి కోసం కుళాయి వద్ద వేచి ఉన్న మహిళలు

తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించి పైపులైను వేయటానికి గోతులు తవ్వి అర్ధాంతరంగా వదిలేసారు. దీంతో గతంలో ఉన్న పైపులైన్లు మూసుకుపోయి ప్రస్తుతం గ్రామంలో రెండు ఇళ్ల వద్దే నీటి కొళాయిలు పనిచేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, స్థానిక శాసనసభ్యులు స్పందించి తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ఈ రెండు గ్రామాల ప్రజల తాగునీటి కష్టాలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి

కెజెపేట, కొత్తపేట గ్రామాల తాగునీటి కష్టాల సమస్యపై మండల గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్ అధికారి జె.పూర్ణమ్మ వద్ద ప్రస్తావించగా జలజీవన్ మిషన్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, బోరు బావి తవ్వటానికి స్థల పరిశీలన చేసినప్పటికీ కాంట్రాక్టర్ పనులపై శ్రద్ధ చూపకపోవడంతో ఈ రెండు గ్రామాల్లో తాగునీటి కష్టాలు ఉన్నాయన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న విసి రజని

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డా.బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి శనివారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.ఆర్.రజని జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివక్షతలు ఎన్ని ఎదురైనా ప్రజలను ఉద్ధరించడానికి పూనుకుని ఆ దిశగా కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని, విద్యార్థులు ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఒఎస్‌డి డా.యు.కావ్యజ్యోత్స్న, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.అనురాధ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రాజశేఖర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ సంత మైదానం సమీపంలో బాబు జగజీవన్‌రావు వర్ధంతి వేడుకలను నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, ఎంఇఒలు సిహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, అప్పల రాజులు జగజ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్తా, డొక్కరి శంకర్, సిహెచ్ నేతాజీ పాల్గొన్నారు.

కొత్తూరు: మండలం మహర్తపురంలో జగజ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తాతబాబు, రేగేటి కన్నయ్య


పలాస : నివాళ్లర్పిస్తున్న నాయకులు తదితరులు

స్వామి, సంజీవరావు, రామకృష్ణ, యడ్ల గోపి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: జగజ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యాన పూలే పార్కు, అరసవల్లి జంక్షన్‌లో ఉన్న ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో దీర్ఘాసి తిరుమలరావు, రాణా శ్రీనివాసరావు, తిరుమలరావు, గొంతు పోలయ్య, కుర్మాన మనోహర్ దాస్, మన్మధరావు, అప్పారావు, భాస్కరరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జడ్జి సురేష్‌కుమార్

చట్టాలపై అవగాహన

ఇచ్ఛాపురం: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యాన శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. భారత న్యాయ సంహిత చట్టాలు గురించి, మహిళలు, బాలికల రక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో సిఐ టి.ఇమ్మాన్యుల్‌రాజు, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఐసిడిఎస్ పిఒ నాగారాణి, డిటి శ్రీహరి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమణయ్య, దేవరాజు, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, రంగారావు, రాంబాబు పాల్గొన్నారు.


మానవహారం నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

డెంగీపై అవగాహన అవసరం

పోలాకి: స్థానిక పిహెచ్‌సిలో శనివారం వైద్యాధికారి శ్రీనాథ్ పర్యవేక్షణలో ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ ఆధ్వర్యంలో డెంగీ అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి రకాలు, లక్షణాలు, వ్యాప్తి, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స కోసం వివరించారు. మానవాళిని కబలిస్తున్న ఈ వ్యాధి అర్బో వైరస్ అనే క్రిమి వల్ల కలుగుతుందని, పగటిపూట కరిచే ఎడిస్ ఆడ దోమ (టైగర్)దోమ ద్వారా ఈ వ్యాధి రోగినుంచి ఆరోగ్యవంతునికి సంక్రమిస్తుందన్నారు. ఉన్నట్టుండి అధిక జ్వరం రావడం, 2 కనుబొమ్మల మధ్య తలనొప్పి, కంటి లోపల నొప్పి, కను కదలికలు తగ్గడం, కండరాల, కీళ్ల నొప్పులు, ఆర్థ్రల్జియా, మాయల్జియా, రక్త కణాలు ఎక్కువ సంఖ్యలో తగ్గడం, వ్యాధి తీవ్రస్థాయిలో రక్తకేశ నాళికలు చిట్లి రక్తం వివిధ అవయవాల నుంచి చిమ్మి ప్రమాద స్థితికి చేరుకుంటుందని, దీనిని డెంగీ హిమరజిక్ ఫీవర్‌గాను పిలుస్తారన్నారు. ఎలిసా పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగు తుందన్నారు. దోమల నివాసాలను తొలగించుట, డ్రమ్ములు, పూలకుండీలను పరిశుభ్రం చేయాలని, నీటి నిల్వలపై మూతలు పెట్టాలన్నారు. అనంతరం సిబ్బంది, గ్రామస్తులతో కలిసి డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ ఆరోగ్యశాఖ సిబ్బందితో మానవహారం నిర్వహించారు. శేఖర్‌బాబు, లక్ష్మి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు బాండ్ల రూపంలో పరిహారం


సమావేశంలో మాట్లాడుతున్న గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోతున్న బాధితులకు బాండ్ల రూపంలో నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని, సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన ఈ రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయడానికి బాధితులు సహకరించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. శనివారం శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయంలో సుడా, నగర కార్పొరేషన్, ఆర్అండ్‌బి అధికారులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు విస్తరణకు 20 ఏళ్ల క్రితం రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా లేకపోవడంతో కొత్తగా మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతుందన్నారు. విస్తరణలో స్థలం కోల్పోతున్న సుడా, మున్సిపల్ పరిధిలో బాధితులతో పాటు గ్రామీణ ప్రాంతంలో ఉన్న పలువురు బాధితులకు ఆర్అండ్‌బి శాఖ ద్వారానే పరిహారం చెల్లించేందుకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తున్నట్టు తెలిపారు. టిడిఆర్ బాండ్ల రూపంలో నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ బాండ్లపై అవగహన కల్పించేందుకు బాధితులతో రెండు, మూడు రోజుల్లో సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు షాపుల తనిఖీ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గకు చెందిన తాళాసు గోవిందరావు ఎరువుల షాపును మండల ఎఒ పోలారావు శనివారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులో ఉన్న స్టాక్, గోదాములో ఉన్న సరుకులను సక్రమంగా ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. అనంతరం విత్తనాలు, ఎరువులు శాంపిళ్లను సేకరించి నాణ్యత కోసం తిరుపతి ల్యాబ్‌కు పంపిస్తున్నామని తెలిపారు, ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట వ్యవసాయ శాఖ ఎఇఒ చింతాడ శారద ఉన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక వైశ్యరాజు గోవిందరాజు, ధోని కొండలరావు పురుగులు, మందులు, ఎరువులు, విత్తనాలు దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.


టెక్కలి రూరల్ : తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నిల్వ రిజిస్టర్స్, బిల్లు పుస్తకాలు, గొడౌన్ నిల్వలను పరిశీలించారు. రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ బోర్డుపై వివరాలు, ధరలు పట్టికను ప్రదర్శించాలన్నారు. నిల్వ ఉన్న సరుకులు రోజూ కంప్యూటరీకరణ చేయాలన్నారు. ఈ తనిఖీలో తాడేపల్లి గూడెం వ్యవసాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, విజిలెన్స్ డిఎస్‌పిఎస్ కిరణ్‌కుమార్, జిల్లా నాణ్యత నియంత్రణ అధికారి ఎల్.మురళీధర్, ఎఒ జి.రంగారావు ఉన్నారు.


టెక్కలి : మాట్లాడుతున్న జడ్జి చక్రవర్తి

హెల్మెట్ తప్పనిసరి

టెక్కలి : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.హెచ్.ఆర్. తేజచక్రవర్తి మల్లా సూచించారు. టెక్కలి కోర్టులో న్యాయవాదులతో, పోలీసులతో, కక్షిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు అతిక్రమించ కుండా చూడాలని, వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ ఎం.రూపావతి, పి.వెంకటరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, పేడాడ బాబూరావు, వైకుంఠరావు పాణిగ్రాహి పాల్గొన్నారు.

పలాస: వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. స్థానిక సివిల్ కోర్టులో ఆటో యూనియన్ నాయకులతో, డ్రైవర్లతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాణం ఎంతో విలువైనదని, హెల్మెట్ ధరించడం వల్ల చాలా వరకు ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చునని అన్నారు. ఆటోడ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్‌రాజు, కోత రజనికుమార్, జి.ప్రభాకర్, శ్యామ్, రవి, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఎస్.వి.సంతోష్‌కుమార్, ఎఎస్ఐ ప్రకాష్, కోర్టు కానిస్టేబుళ్లు నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఆవు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి సమీపంలో శనివారం సాయంత్రం గునుపూర్-రౌర్కెల రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని ఆవు మృతి చెందింది. శనివారం సాయంత్రం టెక్కలి మీదుగా రైలు వెళ్తున్న సమయంలో పట్టాల మధ్యలో ఆవు పరిగెత్తడంతో ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో ఆవు మృతి చెందింది. గమనించిన రైల్వే సిబ్బంది రైలును ఆపారు. అయితే అప్పటికే రైలు ఆవును ఢీ కొట్టడంతో మృతి చెందింది.


కారును పరిశీలిస్తున్న పోలీసులు, మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు

వైసిపి నాయకుని కారు దగ్ధం

ప్రజాశక్తి- రణస్థలం

మండలం నారువలో వైసిపి నాయకులు ఆళ్ల అసిరయ్య కారును గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి నిప్పుపెట్టి దగ్ధం చేశారు. ఈ మేరకు స్థానిక జె.ఆర్ పురం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి అసిరయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నాయకుల దాడులు పెరిగిపోతున్నాయని ఇటువంటి దాడులు జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఈ దాడులను వైసిపి తీవ్రంగా ఖండిస్తుందని, ఈ సంఘటనపై జిల్లా ఎస్‌పి దృష్టిలో పెడతామని, గత 20 ఏళ్లుగా ప్రశాంతంగా ఉన్న ఎచ్చెర్ల నియోజక వర్గంలో కూటమి నాయకులు వచ్చిన నెలరోజుల్లోనే దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఈయన వెంట వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొర్లె శ్రీనువాసరావు తదితరులున్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

సానుభూతి ప్రేలాపనలు మానుకోవాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసిపికి గుణపాఠం చెప్పారని దీంతో మతిభ్రమించిన జగన్మోహన్ రెడ్డి సానుభూతి ప్రేలాపనలు మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలం ఇటీవల మృతి చెందిన కుటుంబాల పరామర్శకు మూల సవలాపురం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుభవజ్ఞుడైన సిఎం చంద్రబాబు నాయుడు మాజీ సిఎంగా జగన్‌ను గౌరవించినప్పటికీ విలువలు కోల్పోయి వింత ప్రేలాపనలు పేలుతున్నారన్నారు. తండ్రి, బాబాయి మరణాలతో సానుభూతి నాటకమాడి 2019లో అధికారం చేపట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసాడని, నేడు వింత ప్రేలాపనలతో కేసులు పెట్టించుకుని ప్రజల సానుభూతి పొందాలన్న ఆలోచనలో ఉన్నాడని విమర్శించారు. అధికారం చేపట్టిన 20 రోజుల్లో ఎన్నికలలో ఇచ్చిన పింఛన్ల హామీని నెరవేర్చిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు, టిడిపి నాయకులు సూర్యనారాయణ, అంబళ్ల రాంబాబు, తిరుమలరావు, టి.సురేంద్ర, ఎం. అప్పల నాయుడు, జె.పాపారావు, జి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ధ్రువపత్రాలు అందజేత

శ్రీకాకుళం అర్బన్: నగర పరిధిలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ (ఎంఎస్ఎంఇ) సర్టిఫికెట్లను హౌసింగ్ బోర్డు కాలనీలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శవ్వాన ఉమామహేశ్వరి, జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, టిడిపి నాయకులు అంబటి లక్ష్మీరాజ్యం, విభూది సూరిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పాతపట్నం : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగిలి ఉన్న సీట్లుకు మంగళవారం భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన తెలిపారు. 5వ తరగతికి సంబంధించి సీట్లును లాటరీ రూపంలో కేటాయించడం జరుగుతుందని, ఇంటర్మీడియట్‌కు మార్కుల ఆధారంగా, మొదటిగా పరీక్ష రాసిన వారికి ప్రాధాన్యత ఇచ్చి సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సోమవారంలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8096613777 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నందిగాం: స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కొరకు ఈ నెల 8న ఉదయం 10 గంటలకు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.దమయంతి ప్రకటనలో కోరారు. మరిన్ని వివరాలకు 6281905023 నెంబర్‌ను సంప్రదించాల న్నారు.

నేడు బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

టెక్కలి రూరల్: స్థానిక కొడవీధిలో లక్ష్మీనరసింహ ఆలయం దశ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం తెలుగు బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ కార్యదర్శి వడుగూరు రాజేష్ తెలిపారు. నియోజకవర్గంలోని బ్రాహ్మణ కుటుంబాలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పెంపుడు జంతువులకు ఉచిత టీకాలు

టెక్కలి రూరల్: టెక్కలి పరిధిలో ఉన్న 85 కుక్కలకు శనివారం జూనోసిస్ డే సందర్భంగా ఉచిత రేబిస్ వ్యాధి టీకాలను వేసినట్లు డాక్టర్ జి. గురంనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెంపుడు కుక్కల ఆరోగ్య సంరక్షణ అదే విధంగా కుక్కలు, కోళ్లు, గొర్రెలు, పందులు, పశువులు తదితర పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు వివరించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. వెంకటరమణ, ఎల్ఎస్ఎ విజయ్ కుమారి, ఒఎస్ రామకృష్ణ, ద్రోణాచార్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం పశు వైద్యశాఖలో వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 64 పెంపుడు కుక్కలకు యాంటీరాబిస్ టీకాలను శనివారం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అంటారని అన్నారు. ఈ


మందస : కుక్కలకు టీకా వేస్తున్న శ్రీకాంత్

వ్యాధుల నివారణకు ప్రజలు వీటిపై అవగాహన పెంచుకొని ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది ధర్మేంద్ర, ప్రసన్న, బాలకృష్ణ, సంతోషి, శ్రీను, కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : స్థానిక పశుల ఆస్పత్రిలో ప్రపంచ జోనోసిన్ దినోత్సవం సందర్భంగా 64 కుక్కలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవింద రాజులు, మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, పశుసహాయ సంచాలకులు డాక్టర్ మందా లోకనాథంలు యాంటీరాబిస్ టీకాలను వేశారు. పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్, వెటర్నరీ అంబులెన్స్ డాక్టర్ పైల మైత్రి, రోహిత్, శాంతారావు, ధర్మారావు పాల్గొన్నారు.

ఎంపీ కలిశెట్టికి ఘన స్వాగతం

ప్రజాశక్తి- రణస్థలం

విజయనగరం పార్లమెంట్ సభ్యునిగా ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి తొలిసారిగా అత్యధిక మెజార్టీతో ఎన్నికై ప్రమాణ స్వీకారం పూర్తి చేసుకొని మొదటిసారి నియోజకవర్గానికి విచ్చేసిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు విశాఖ విమానాశ్రయంలో నేతలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. కలిశెట్టి సొంత నియోజకవర్గం ఎచ్చెర్ల నుంచి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు విశాఖ తరలివెళ్లి నీరాజనం పలికారు. అక్కడ నుంచి దారిపొడువునా గజమాలలు, మంగళహారతులతో ఎంపీకి సాదరస్వాగతం పలికారు. విశాఖపట్నంలో స్థిరపడిన కొంతమంది, విజయనగరానికి చెందిన కుటుంబాలు దారి పొడవునా పుష్పగుచ్ఛాలు అందించి గజ మాలలతో సత్కరించారు. విజయనగరం మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు బంగ్లాకు చేరుకోగా అక్కడ నేతల ంతా ఘనంగా సత్కరించారు. అక్కడ నుంచి పైడి భీమవరం, కోష్ట మీదుగా రణస్థలం చేరుకున్న



కలిశెట్టి అప్పల నాయుడుకు కూటమి నేతలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. వందలాది వాహనాలతో ఎచ్చెర్ల చేరుకున్న కలిశెట్టి అప్పల నాయుడు అభిమానుల స్వాగతాన్ని అందుకొని విజయనగరం పార్లమెంట్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. సాగునీరు, తాగునీరు, రోడ్లు, విద్యుత్‌తో పాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగు పరిచేందుకు తనవంతు కృషి చేస్తానని, తనను ఎన్నుకున్న విజయనగరం పార్లమెంట్ ఓటర్లకు రుణపడి ఉంటానని, నిత్యం ప్రజలకు సేవలందిస్తానన్నారు. స్వాగతం పలికిన వారిలో టిడిపి జిల్లా పూర్వ అధ్యక్షుడు చౌదరి బాబ్జీ, బిజెపి రాష్ట్ర నాయకులు పైడి వేణు గోపాలం, జనసేన నాయకులు బాడాన జనార్ధనరావు, బిజెపి కో-కన్వీనర్ సంపతిరావు నాగేశ్వరరావు, డి.జిఎం. ఆనందరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న రైతులు

రైతుల ఆందోళన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైతులకు సాగునీటికి ఉపయోగపడే పనులు చేయాలని ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఇజిఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీనికి విరుద్ధంగా మండలంలో పనులు జరుగుతుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చాపరలో పనులు ఒక దగ్గర ఫొటోలు, ఇంకో దగ్గర మళ్లీ ఫొటోలు తీసి అధికారులు అప్‌లోడ్ చేయడంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గోపీనాథపురం బట్టి పనులు పనులు చేసి... గుచ్చిరిబట్టి వద్ద ఫొటోలు తీయడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. రైతులకు సాగునీటికి ఉపయోగపడే పనులు చేయాలని ప్రభుత్వం చెప్పినా... అధికారులు పట్టించుకోవడంలేదని టిడిపి నాయకులు మజ్జి పోలినాయుడు, దారపు దామోదరరావు తెలిపారు. ఉన్నతాధికారులు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రేబిస్‌పై అవగాహన అవసరం

శ్రీకాకుళం అర్బన్: రేబిస్ వ్యాధికి చికిత్సలేదని నివారణ ఒక్కటే మార్గమని లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ర్యాబిస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి మాట్లాడుతూ కుక్క కరిచినా, లాలాజలం తాకినా, గోళ్ళతో రక్కినా, వ్యాధి లక్షణాలతో సంబంధం లేకున్నా వాక్సిన్ తీసుకోవాలని, వైద్యులను సంప్రదించి జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ డాక్టర్ పైడి సిందూర, పశువైద్యాధికారి బి.యేగేశ్వరరావు, మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్, పూర్వపు సెక్రటరీ టెక్కం గోపి, ఉపాధ్యక్షులు డి.విష్ణుమూర్తి, సభ్యులు డి.తిరుమలరావు, గుత్తు చిన్నారావు, లాడి నాగరాజు పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న బాబూరావు

ప్రతి సెంటుకూ వంశధార నీరు

ప్రజాశక్తి- పలాస

ఖరీఫ్ ముందుగానే ప్రతి సెంటుకూ వంశధార నీరందేలా చర్యలు తీసుకుంటున్నామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. మండలంలోని మొదుగులవుట్టి వద్ద వంశధార కాలువ నుంచి సరఫరా అవుతున్న సాగునీటిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌతు శిరీష్ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఖరీఫ్ ప్రారంభం కాకముందే వంశధార నీరు శివారు భూములకు సరఫరా చేస్తున్నామన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో వంశధార నీరు శివారు భూములకు అందించలేకపోయారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్‌గుప్తా, డొక్కరి శంకర్, దువ్వాడ హేంబాబుచౌదరి, జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు, బడ్డ నాగరాజు, సాసుమాన చంద్రమౌళి, దువ్వాద శ్రీహర్ష దువ్వాద సంతోష్‌కుమార్, కొండె నర్సింహులు పాల్గొన్నారు.


బస్ షెల్టర్ ప్రారంభంలో రోటరీ ప్రతినిధులు

బస్ షెల్టర్ ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందని రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల రాజ్ కుమార్, పైడిశెట్టి దినేష్ అన్నారు. స్థానిక అర్‌జె కమ్యూనిటీ హాల్‌లో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం నిర్వహించారు. అధ్యక్షునిగా మాచర్ల రాజ్‌కుమార్, సెక్రటరీగా పైడిశెట్టి దినేష్, ట్రెజరర్‌గా మాటూరు నవీన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా కేటేపల్లి డాక్టర్ వేదవ్యాస్, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీగా ఐసి.రావును క్లబ్‌సభ్యులు ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను డిస్ట్రిక్ట్ గవర్నర్ విశ్వనాథ్, గెస్ట్ అఫ్ హానర్‌గా అసిస్టెంట్ గవర్నర్ రాజనీకాంత్, జెసిఐ పాస్ట్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రజిత పూసరలా, రోటరీక్లబ్ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తపురంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.3 లక్షలతో నిర్మించిన నూతన బస్సుషెల్టర్‌ను చీఫ్‌గెస్ట్ విశ్వనాథ్, గ్రామపెద్దల చేతులమీదుగా ప్రారంభించారు.

బాల సంజీవని సరుకుల పంపిణీ

ఇచ్ఛాపురం : గర్భిణులకు, బాలింతలకు బాల సంజీవని సరుకులను 22 వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ అంగన్వాడీ కేంద్రంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, సురేఖ ఫాతిమ, కోమలి, పుణ్య పాల్గొన్నారు.


ఆనంద్ రౌలోను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఆలయ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐ వితరణ

ప్రజాశక్తి- కవిటి

కవిటి నుంచి సముద్రతీరం వైపు వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ఉదారంగా విరాళాలు అందిస్తున్నారు. అందులో భాగంగా మండలం బొరివంకకు చెందిన ఎన్‌ఆర్‌ఐ ఆనంద్ రౌలో రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం పనులు వేగవంతం చేసేందుకు దాతల సహాయం అవసరమన్నారు. అనంతరం ఆనంద్ రౌలో, బొరివంక ఎంపిటిసి దుద్ది సతీష్‌ను కమిటీసభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, మొగిలిపురి సీతాలు, బిపి రెడ్డి, భావన రవి, పాతిన వెంకటరావు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీకి బస్సు సౌకర్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలం పాత్రునివలస సమీపంలోని టిడ్కో కాలనీ వాసుల ప్రయాణ కష్టాలకు తెరపడింది. వివిధ పనులపై కాలనీ నుంచి నగరానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఎమ్మెల్యే గొండు శంకర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసారు. శనివారం టిట్కో కాలనీ-పాత బస్టాండ్ పల్లె వెలుగు బస్సు సర్వీస్‌ను ఆయన కాలనీలో ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు కాలనీ నుంచి, తిరిగి సాయంత్రం 6.30 గంటలకు పాత బస్టాండు నుంచి ఈ సర్వీస్ నడుస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. బస్ సర్వీస్‌ను కాలనీ వాసులు సద్వినియోగం చేసుకుంటే జనాధరణ మేరకు మరిన్ని బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీవాసుల రవాణా ఇబ్బందుల దృష్ట్యా బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందని, అదేవిధంగా రేషన్ కష్టాలు తొలగించేందుకు కాలనీలోనే రేషన్‌డిపోను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో 1వ డిపో మేనేజర్ మల్లిఖార్జునరాజు, టిడిపి నాయకులు, వివిధ డివిజన్‌ల ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

బస్సు పున:ప్రారంభం

నందిగాం : మండలంలోని వల్లభ రాయుడు పేట నుంచి టెక్కలి వెళ్లే ఆర్‌టిసి బస్సును గత కొన్నేళ్లుగా నిలిపివేశా రు. అయితే టిడిపి అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్రామాల ప్రజలు టెక్కలి ఎమ్మెల్యే, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు విన్నవించుకో వడంతో శనివారం ఈ బస్సును టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ బస్సు ఉదయం 6 గంటలకు టెక్కలిలో బయలుదేరి వల్లభ రాయుడుపేట చేరుకుంటుం దని అనంతరం ఏడు గంటల తరువాత వల్లభ రాయుడుపేట నుంచి శ్రీకాకుళం వెళ్తుందని, మరల శ్రీకాకుళం నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి 7:30 గంటలకు వల్లభ రాయుడుపేట చేరుకుంటుందని ఆర్‌టిసి అధికారి జి.మన్మథరావు తెలిపారు. తెలుగు యువత మండల అధ్యక్షులు ఎం.బాలకృష్ణ, జి.మన్మథరావు, కృష్ణారావు, సబ్బి జానకిరాం పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కౌలుదారు కార్డులు ఉన్న కౌలుదారులకు ప్రభుత్వం నుంచి అందించే సంక్షేమ పథకాలు అందుతాయని మండల ఎఒ దానకర్ణుడు అన్నారు. మండలంలోని జోడూరు, గంగరాజపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద కౌలు రైతులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలుదారులు కార్డు తీసుకున్న రైతులు పంట నమోదు, బీమా, విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై సరఫరా చేస్తామన్నారు. ధాన్యం మద్దతు ధరకు విక్రించుకోవచ్చునని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంటలకు నష్టపరిహారం అందుతుందని అన్నారు. ఈ కార్డు 11 నెలలు కాల పరిమితి ఉంటుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలోని విఆర్ఒ, విఎఎలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే సేంద్రీయ కర్బనం తక్కువగా ఉన్నందు వల్ల ప్రతి రైతు విధిగా సేంద్రీయ ఎరువులను భూసారం నిమిత్తం వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భాగ్యం, శంకరరావు, టిడిపి నాయకులు జీరు కృష్ణారావు, బూర్లె శ్రీనివాసరావు, ఢిల్లీరావు, విఆర్ఒ అప్పలనాయుడు, అన్నాజీరావు, విఎఎలు సర్వాణి, సూర్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఒ దానకర్ణుడు

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులు తమ పొలాల్లో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించడం వలన రైతులకు మేలు జరుగుతుందని వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. శనివారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు పురాతన పద్ధతిలో పశువుల పేడ, కుళ్లిన పెంట గత్తం, వర్మీ కంపోస్ట్ తదితర సాంప్రదాయ ఎరువలను ఉపయోగిస్తూ, పంటలను పండిస్తే ప్రజా ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. అధిక మోతాదులో కలుపు, కీటక నాసిని మందులను ఉపయోగించడం వలన భూమి ఆరోగ్యంపాడై కొన్నాళ్లకు చౌడుబారి పంటలకు ఉపయోగపడకుండా పోతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని మహిళా రైతులకు అవగాహన కల్పించారు. మహిళా రైతులంతా గ్రామాల్లో అవగాహన కల్పించి పెరటి తోటల పెంపకం, ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ సిసి రామప్పడుతో పాటు మండల సమాఖ్య లీడర్లు, సిబ్బంది, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ప్రతినిధులు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

నేటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి- పాతపట్నం


కరుణాకరరావు

ఈ నెల 7 నుంచి 14 వరకు పశు గ్రాస వారోత్సవాలు నిర్వహించనున్నామని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాలు సందర్భంగా పశు గ్రాసాల పెంపకం, దానిద్వారా దాన ఖర్చు తగ్గించడం, తద్వారా పాడి పరిశ్రమ లాభసాటిగా ఉండేటట్లు రైతుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. వారం రోజులు పాటు గ్రామాలు తిరిగి పాడి రైతుల్లో పశుగ్రాసం పెంపకంపై ఆసక్తి కనబరిచేటట్లు చేయడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


యూనిఫారాలు అందిస్తున్న ఉషోదయ సభ్యులు

యూనిఫారాల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు స్థానిక ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన రూ.25 వేలు విలువచేసే 50 యూనిఫారాలను శనివారం అందజేశారు. వీటిలో 40 జతలు ఉషోదయ యువజన సంఘం అందజేయగా, కవిటికి చెందిన కరగాన వెంకటరావు 10 జతలు అందజేశారు. కార్యక్రమంలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, బెందాళం రమేష్, ఆరింగి మధు, ఆరింగి రాజు, పులకల వెంకటరావు, బి.విశ్వనాథం, చిన్నారావు, మొగిలిపురి సీతాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు కేటాయించినట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి బోర్లు, రహదారులకు పూర్తిస్థాయిలో ప్రాధాన్యత కల్పించినట్లు వివరించారు. అందరి సహకారంతో రాబోయే కాలంలో పంచాయతీలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి నీలాచలం, మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, ఈఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఇఒ వీరభద్రస్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ అర్బన్ సిడిపిఒ శోభారాణి పేర్కొన్నారు. శనివారం గూనపాలెంలో సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తరచూ చేతులు కడుక్కోవడం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. నగరంలోని అంగన్వాడీలు, సహాయకులు అవగహన కల్పించారు. ప్రీ స్కూల్ పిల్లలకు హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్ను నాగార్జున ప్రతాప్, రాజు, హరి, విజయ పాల్గొన్నారు.


అవగాహనా కార్యక్రమంలో అంగన్వాడీలు

జంతువుల నుంచి వచ్చే వ్యాధులపై అప్రమత్తం

ఎమ్మెల్యే గొండు శంకర్



శ్రీకాకుళం అర్బన్ : పెంపుడు జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. వరల్డ్ జూనోసిస్ డే సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఆవరణలో కుక్కలకు యాంటీరాబిస్ టీకాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవులపై, జంతువులపై జూనోటిక్ వ్యాధుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. అందువల్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధులు సంక్రమించకుండా పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని ప్రజలకు సూచించారు. ప్రతిఒక్కరూ పెంపుడు జంతువుల సంరక్షణపై దృష్టిసారించి క్రమం తప్పకుండ టీకాలు వేయించాలన్నారు. పశుసంవరర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయరాజు మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైందని అన్నారు. పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి 1885 జూలై 6న లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటి సారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారని చెప్పారు. ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందింది దృష్ట్యా ఈ రేబిస్ టీకాను కనుగొన్న జూలై 6న ఏటా ప్రపంచ జినోసిస్ డే నిర్వహిసుకుం టున్నామని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడిలు కె.రాజగోపాల్, టి.మనోజ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు వై.వెంకటకృష్ణారావు, కిషోర్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎపిడి లోకేష్

పొందూరు: ఉపాధిహామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులు తమ భూముల్లో పండ్ల తోటలను పెంచేందుకు అవసరమైన మొక్కలను అందజేస్తున్నట్లు ఎచ్చెర్ల క్లస్టర్ ఎపిడి కె.లోకేష్ తెలిపారు. క్షేత్రసహాయకులతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన కొబ్బరి, మామిడి, జీడి, జామ, మునగ వంటి పలు మొక్కలు అందుబాటులో ఉన్నాయని, 3 ఏళ్లపాటు మొక్కలు పెంచేందుకు అయ్యే ఖర్చు రైతుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. క్లస్టర్ పరిధిలోని పొందూరు, ఆమదాలవలస, ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లో ఇప్పటివరకూ 295 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు పనులు జరుగుతున్నా యని తెలిపారు. అలాగే ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు సాగునీరు సరఫరా జరిగేలా ఉపాధిహామీ పథకం ద్వారా పంట కాలువల్లో పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగింపు పనులను ముమ్మరంగా చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఎపిఒ పి.శ్రీనివాస రావు, టెక్నికల్ అసిస్టెంట్లు నటరాజ్, పోలారావు, ఈశ్వరరావు, జగన్, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని సన్యాసినీలాపురం వద్ద నిర్మించిన మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకానికి మరలా పునర్జీవనం కల్పిస్తూ... వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.31.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం ఎత్తిపోతల పథకం వద్ద టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్ కుమార్ ఆధ్వర్యాన రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ పథకం పనులు మరమ్మతులు పూర్తయితే గూడెం, నర్సింగపల్లి, ముఖలింగాపురం పంచాయతీల పరిధిలోని పలు గ్రామాలకు సాగునీరు అందుతుంది. కేంద్ర పౌర విమానయానాశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభినందనలు తెలిపారు. పోలాకి షణ్ముఖరావు, దారపు జోగారావు, రట్టి కామరాజు, గండేటి భీమారావు, పోలాకి తిరుపతిరావు, గుజ్జురు సత్యనారాయణ, దారపు పాపారావు, సింగుపురం షణ్ముఖరావు, వజ్జల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

విధి విధానాలు అమలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న మహిళా పోలీసులు

ప్రజాశక్తి- రణస్థలం

సరైన విధివిధానాలు ఏర్పాటు చేసి తమకి న్యాయం చేసే దిశగా ప్రణాళిక రూపొందించాలని మహిళా పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ జాయింట్ సెక్రటరీ, కోష్ట సచివాలయ మహిళా పోలీస్ అమ్మోజీ కోరారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండల సచివాలయ మహిళా పోలీసులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనేక శాఖల పనులు చేస్తున్నప్పటికీ తమకు తగిన గుర్తింపు లేదన్నారు. మహిళా పోలీసుల కోర్టు కేసు విషయంలో పురోగతి వచ్చేలా చూసి తమకి లైన్ డిపార్ట్మెంట్ కేటాయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ సాలువతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అర్హత ఉన్నవారు ఉన్నత ఉద్యోగ సాధన కోసం ప్రయత్నించాలని సూచించారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా సహకారం అందిస్తుందన్నారు.

గెడ్డలో జారిపడి ఆవు మృతి


మృతి చెందిన ఆవు

వజ్రపుకొత్తూరు: మండలంలోని అనంతగిరి గొల్లవీధికి చెందిన బడకల ప్రకాష్ ఆవు శనివారం గెడ్డలో జారిపడి మృతి చెందింది. దీని విలువ రూ.70 వేలు ఉంటుందని రైతు తెలిపారు. రోజుకు 5 లీటర్ల పాలు ఇచ్చేదని అన్నారు. పశువైద్యాధికారి మెట్ట పాపారావుకు సమాచారం అందించారు. ఆవు మృతితో ఆ కుటుంబం ఉపాధిని కోల్పోయిందని, పాడి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.


మంత్రి నాదెండ్లతో రాజు

మంత్రి నాదెండ్లను కలిసిన రాజు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జనసేన పిఎసి చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఇచ్ఛాపురం జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అలాగే స్థానిక సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు రాజు తెలిపారు.


పొన్నాంపేటలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు

పొన్నాంపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలం పొన్నంపేటలో సర్పంచ్ చల్లా ఉష ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. శనివారం గ్రామంలోని వీధులను శుభ్రపరుస్తూ మురికి కాలువల్లో చెత్తను తొలగించి క్లోరినేషన్ చేపట్టారు. చెత్త కుప్పలను తొలగించి ట్రాక్టర్‌తో డంపింగ్ యార్డ్‌కు తరలించారు. రహదారులపై నిలిచిన నీటిని తొలగించి దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్‌ను చల్లారు. సర్పంచ్ మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలం అని అంటూ వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో పారిశుధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ రమణమ్మ, సర్పంచ్ ప్రతినిధి కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి


కోటేశ్వరరావు

రైతులు చెప్పకముందే వారి సమస్యలు ముందే గుర్తించి వాటిని పరిష్కరించి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు న్యాయం చేశారని జనసేన జిల్లా కార్యదర్శి పల్లి కోటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మారిన వ్యవస్తను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే వంశధార ప్రధాన కాలువల్లో శివారు ప్రాంతాలకు సాగునీరందించే లక్ష్యంగా జంగిల్ క్లియరెన్స్, ప్రస్తుతం అవసరాలకు సంబంధించి రూ.90 లక్షలతో పనులు ప్రారంభించారని తెలిపారు. దీంతో ఈ ఏడాది రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందన్నారు.

శివకుమార్ మృతికి ప్రెస్‌క్లబ్ నివాళి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలికి చెందిన పాత్రికేయుడు గనియా శివకుమార్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో శనివారం టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు అధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బగాది వాసుదేవరావు, గనియా శ్రీనివాస రావు, వట్టికోల కీర్తి కుమార్, కోట రాము రెడ్డి, సంకు గోపినాథ్, మార్పు పద్మలోచనరావు, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు



ప్రజాశక్తి

ఉపాధ్యాయ ఉద్యమ నేత

కామ్రేడ్ బత్తిని ఓంకార్ (మాస్టార్)

శ్రద్ధాంజలి

ప్రత్యేక అనుబంధం

Advt. Feature

4 పేజీలు | పలాస | శ్రీకాకుళం జిల్లా | ఆదివారం 7-7-2024

ఉద్యమాల రథసారథి



- ప్రజా సమస్యలపై ఓంకార్ పోరుబాట
- ఉపాధ్యాయ ఉద్యమాల్లో చెరగని ముద్ర

ప్రజాశక్తి - పలాస

ఉద్దాన ప్రాంతంలో ఉద్యమాల మాస్టారుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు ఓంకార్ మాస్టర్. ప్రజా సమస్యలపై పోరాటాలకు తాను ఉన్నానంటూ మద్దతు పలికి ఉద్యమానికి చేదోడుగా నిలిచారు. సమాజంలో జరుగుతున్న, ఎదుర్కొంటున్న అసమానతలకు వ్యతిరేకంగా చేపట్టే ఉద్యమాల్లో మమేకమై డప్పు కొట్టి, పాట పాడి రెట్టించిన ఉత్సాహంతో, ఉద్యమ స్ఫూర్తితో ముందుండేవారు. మహమ్మారి కిడ్నీ వ్యాధితో ఉద్దానం కూలిపోతుందని, ఉద్యమాలతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఉద్దాన ప్రాంత ఆరోగ్య పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసి, ఇచ్ఛాపురం నుంచి టెక్కలి వరకు పల్లె పల్లె తిరిగి ప్రజలను చైతన్యపరచడంలో ముఖ్య పాత్ర పోషించారు. ఉద్దాన ప్రాంత విద్యా అభివృద్ధి వేదిక వ్యవస్థాపకుల్లో ఒకరిగా, విద్యా సాంస్కృతిక రంగాల్లో తనదైన ముద్ర వేశారు. ఉపాధ్యాయ సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. ప్రజా చైతన్యానికి కళాకారునిగా, మేధావిగా, ఉపాధ్యాయ ఉద్యమ నేతగా ఉద్దానంలో గుండెచప్పుడై... సమస్యల పరిష్కారానికి ఉద్యమాలతో చెరగని ముద్ర వేశారు.

పలాస మండలం మాకన్నపల్లిలో త్రినాథ్, మహాలక్ష్మి (శేషమ్మ) దంపతులకు రెండో సంతానంగా 1968లో ఓంకార్ జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి త్రినాథ్ మృతి చెందడంతో తన తాతయ్య గ్రామమైన బొడ్డపాడులో నివాసం ఉంటూ ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు అక్కడ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ సోంపేట పాఠశాలలో చదువుకున్నారు. ఇంటర్మీడియట్ పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ ఎస్‌బిఎస్‌వైఎం కళాశాలలో చదువుకున్నారు. ఆంధ్రా మిగతా 2లో

ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరనిలోటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓంకార్ మాస్టారు మృతి ఉపాధ్యాయ ఉద్యమాలకు తీరని లోటు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన కాలంలో ఉపాధ్యాయరంగ సమస్యలపై అనేక పోరాటాలు సాగించారు. గుర్తు చేశారు. తన ఆరోగ్యం బాగాలేదని తెలిసినా రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమాల్లో పాల్గొనేవారు. అందరిలో ప్రగతిశీల భావాల వ్యాప్తి జరిగితేనే మంచి సమాజస్థాపన జరుగుతుందని విశ్వసించేవారు. ఆయన ఆశయాలు, లక్ష్యాలు మధ్యలోనే ఆగకుండా వాటిని అమలు చేసే కర్తవ్యం మనమంతా తీసుకోవాలి. జిల్లాలో ఉపాధ్యాయుల గుండెల్లో ఆయన జీవించే ఉన్నారు. ఆయన ఆశయాలకు మరిన్ని పోరాటాలతో ఉద్యమాలను నిర్మిద్దాం.

- ఎస్.కిశోర్‌కుమార్,
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

- ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి
యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి

ప్రజా ఉద్యమాలతోనే నివాళి



విద్యార్థి యువజన ఉద్యోగ ఉపాధ్యాయ రైతాంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన ఉద్యమ నాయకుడు కామ్రేడ్ ఓంకార్. కామ్రేడ్ ఓంకార్ మాస్టారు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. ఎస్ఎఫ్ఐ నాయకుడిగా, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా, యువజన సంఘాల నాయకుడిగా పలు బాధ్యతలు నిర్వర్తించిన తనయావ జీవితాన్ని ఉద్యమాలకు అంకితం చేసిన గొప్ప నాయకుడు ఓంకార్. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయడమే ఆయనకు మనం ఇచ్చిన ఘన నివాళి. ఓంకార్ ఆశ సాధనకు అందరూ కృషి చేయాలి.

- డి.గోవిందరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఉద్యమ నాయకుడు



మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా నడుస్తున్న ఈ సమాజంలో భిన్నమైన వ్యక్తి ఓంకార్ మాస్టర్. ఉద్దానంలో ప్రతి సంఘంలోనూ తనదైన చెరగని ముద్ర వేసుకున్నారు. సమాజ హితం కోసం నిరంతరం పోరాటం చేసే పోరాట యోధులు కార్మిక, కర్షక, బలహీనుల పక్షాన తన గొంతు వినిపించే నాకు తెలిసి ఏకైక వ్యక్తి. కిడ్నీ వ్యాధిపైన అవగాహనా సదస్సు ఏర్పాటు చేస్తూ, జీడి రైతుల మద్దతు కోసం తనదైన శైలిలో స్పందించే వ్యక్తి. మేము స్థాపించిన గ్రీన్ఆర్మీ సంస్థలో గౌరవ అధ్యక్షులుగా ఉంటూ పర్యావరణ కోసం మాతో పాటు అనేక మొక్కలు నాటి అవగాహన కలిగించే వారు. మూఢనమ్మకాలపై నిరంతరం యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించేవారు. పేద విద్యార్థులకు తనవంతుగా సాయం చేసే వ్యక్తి మా ఓంకార్ మాస్టరు.

- బోనెల గోపాల్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు, పలాస

ఉద్దానానికి తీరని లోటు



ఓంకార్ చిన్నప్పటి నుంచి నాతో అనుబంధం ఉంది. చిన్నప్పటి నుంచి సామాజిక అంశాలపైన, అభ్యుదయ భావజాలంతో పనిచేశాడు. సమస్యలపై పోరాట పటిమ నేను చూచాను. విద్యార్థి దశలోనే విప్లవాలు చదివినాడు. సంఘాలు ఏర్పాటు చేసేవాడు. రణరంగమై కదిలాడు. మన బతుకులు మారాలంటే ఉద్యమాలే అన్నాడు. ఉద్యోగంలో ఉంటూ ఉద్యమాలు చేశాడు. అభ్యుదయ భావాలతో కడవరకు కదిలినాడు. చిన్న వయసులో మృతి చెందడం మా ఊరుకి, ఉద్దాన ప్రాంతానికి తీరని లోటు.

- జుత్తు తాతారావు

అడిషనల్ కమిషనర్, జిఎస్‌టి విఆర్ఎస్, మాకన్నపల్లి, పలాస

ఆప్పుడిని కోల్పోయా...



బత్తిని ఓంకార్ మా చిన్ననాటి స్నేహితుడు, శిష్యుడు, ఆప్తుడు. 1980 తరువాత మార్క్సిస్టు నేత ఎం.ఓంకార్ పేరుతో ఇతన్ని ఎం.ఓంకార్‌గా పిలవడం మొదలుపెట్టాం. అదే పరు స్థిరపడింది. ఆర్థిక పరిస్థితులు సహకరించకకున్నా... పట్టుదలతో పిజి చేశారు. సోంపేట సంక్షేమం హాస్టల్‌లో ఉన్నప్పుడు ఎస్ఎఫ్ఐ కార్యకర్తగా విద్యార్థి ఉద్యమంలో మమేకమయ్యారు. ఆంధ్రా యూనివర్సిటీలో చదివేటప్పుడు కూడా పార్టీ, ప్రజా సంఘాలతో కలిసి పనిచేశారు. స్వతహాగా కళాకారుడు. మాకన్నపల్లిలో సూర్యోదయ కళా మండలి వ్యవస్థాపక సభ్యుల్లో ముఖ్యుడు. పలాస మండలంలో జరిగిన అన్ని ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నాడు అనేకంటే ముందుండేవాడు. అతనితో కిడ్నీ వ్యాధుల శిబిరంలోను, యువివి కార్యక్రమాల్లో, కోవిడ్ సమయంలో పాలుపంచుకున్నారు. ముఖ్యంగా అతను ఆవేశపరుడు. ఆందోళనకారుడు. తనకు అప్పగించిన పని పూర్తయ్యే వరకూ విశ్రమించేవారు కాదు. అని మృతి విద్యార్థులకు, ఉద్యమాలకు, ముఖ్యంగా యువివి తీరనిలోటు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేస్తున్నా.

- తెప్పల ఆనందరావు డాక్టర్, పలాస

నా స్మృతిలో ఓంకార్



ఓంకార్, తాను ఒకే గ్రామానికి చెందిన వాళ్లం కావడంతో బాల్యంలో కలిసిమెలిసి ఉండే వాళ్లం. తర్వాత కాలంలో తాను పలాస హైస్కూల్లో, ఓంకార్ సోంపేట హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న సమయంలో మానాన్న తెప్పల కృష్ణమూర్తి ప్రోత్సాహంతో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో నాతో పాటు ఓంకార్ కూడా సభ్యత్వం తీసుకున్నారు. ప్రస్తుత సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అప్పుడు శ్రీకాకుళం జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్‌గా ఉన్నారు. మేమిద్దరం జిల్లా కమిటీలో కొనసాగుతూ సభ్యత్వం చేర్పించడంలో, విద్యార్థి సమస్యలపై పోరాటంలో పోటాపోటీగా పని చేసే వాళ్ళం. తరువాత కాలంలో మార్క్సిస్టు పార్టీలో చేరి పార్టీ పిలుపుమేరకు ఆయా సమస్యలపై జరిగే పోరాటాల్లో పాల్గొనే వాళ్ళం. మధ్యకాలంలో నేను కొంత వెనుకబడిన, ఓంకార్ నిరంతరం ఉపాధ్యాయ వృత్తే కాకుండా పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఇటీవల జీడి మద్దతు ధర సమస్యలపై ఎపి జీడి రైతు సంఘానికి సంఘీభావంగా రైతుల పక్షాన నిలబడ్డారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు, ఆయన స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించడమే ఆయనకు ఇచ్చిన నివాళి.

- తెప్పల అజయ్ కుమార్, ఎపి జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్, పలాస

ఓంకార్ సామాజిక వైద్యుడు



ఓంకార్ తాను పద్మనాభ పురం కాలనీ పాఠశాలలో కలిసి పనిచేశాం. పాఠశాలలో మౌలిక వసతుల కోసం జరిపిన కృషిలో ఆయన భాగస్వామ్యులు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు అయినప్పటికీ సమాజంలో తన చుట్టూ వున్న రుగ్మతలను పారద్రోలాలని తపన పడుతుండే వారు. సమాజానికి మేలు జరుగుతుందంటే ఏ పోరాటానికైనా సిద్ధమయ్యే వారు. ఉద్దాన వెనుకబాటు అధిగమించేందుకు విద్యే ప్రధాన కారణమని విద్యావేదిక ద్వారా చైతన్య కార్యక్రమాలకు మూల బిందువుగా వ్యవహరించే వారు. నిరాశ నిస్పృహలకు తావివ్వకుండా పని చేసుకుపోవడమే ఆయన నమ్మిన సిద్ధాంతం. సమాజం నాకేమీ ఇచ్చింది అనే ఈ రోజుల్లో సమాజం కోసం తన ఆరోగ్యం సైతం లెక్క చేయని వ్యక్తి ఓంకార్. ఉపాధ్యాయ సమస్యల పోరాటంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్నారు. ఆయన అకాల మరణం యూటిఎఫ్ ఉద్యమానికి తీరని లోటు. ఆయన ఆశయ సాధనకు శ్రమిస్తాం.

- ఎల్.వి చలం, యుటిఎఫ్ జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్

ఉద్యమాల రథసారథి

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్సిటీలో డబుల్ ఎంఎ చేశారు. ఒడిశా రాష్ట్రం బరంపురంలో బిఇడి చేశారు. 1998లో పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మండలం పెదమైనివానిలంక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధుల్లో చేరారు. అప్పట్నుంచి 2003 వరకు అక్కడ పనిచేశారు. ఆ సమయంలో గుండెపోటుకు గురికావడం శస్త్రచికిత్స చేయించుకున్నారు. కోలుకున్న అనంతరం భీమవరం మండలం హుండీ పాఠశాలలో పనిచేశారు. జిల్లాల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం లండారపుట్టుగలో పనిచేశారు. అక్కడ్నుంచి పలాస మండలంలోని కాశీబుగ్గ సాయికాలనీలో పనిచేస్తూ బదిలీపై అదే మండలంలోని పద్మనాభపురం కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు.

చిన్ననాటి నుంచే పోరుబాట

చిన్నతనం నుంచి ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి ఉద్యమాల బాట పట్టారు. ఉద్దాన ప్రాంతంలో ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా పీడిత, కర్షక ఉద్యమాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ప్రజల కోసం పోరాటం చేయాలనే ఆలోచనతో చిన్నతనం నుంచే డప్పు వాయిద్యం, జముకు వాయిద్యం జానపద కళారూపాల వైపు దృష్టిసారించారు. ఓంకార్ మాస్టర్ సోంపేటలో తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలో ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థి సమస్యలపై పోరాటం చేశారు. ఎస్ఎఫ్ఐ శ్రీకాకుళం జిల్లా కమిటీ బాధ్యునిగా విద్యారంగ సమస్యలపై విద్యార్థుల పక్షాన పోరాటాలు చేశారు. తర్వాత ఆంధ్ర యూనివర్సిటీలో విద్యార్థి సంఘ నాయకునిగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. తర్వాత కాలంలో సిపిఎంలో చేరి పార్టీ పిలుపుమేరకు ప్రజా సమస్యలపై చేపట్టిన పోరాటాల్లో నాయకత్వం వహించారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తర్వాత కేవలం ఉపాధ్యాయునిగా బడిలో బోధనకే పరిమితం కాకుండా... ఐక్య ఉపాధ్యాయ సంఘం (యుటిఎఫ్)లో చేరి, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా, పలాస మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారు. అక్షర క్రాంతి(వయోజన విద్య) ఉద్యమంలో చేరి నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా కళా బృందంతో నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేశారు. ఇందుకుగానూ అప్పటి జిల్లా కలెక్టర్ అనిల్‌చంద్ర పునేఠా చేతుల మీదుగా అవార్డునూ అందుకున్నారు.

ఉద్దాన ప్రాంతంలో యువత విద్యకు దూరమవుతున్నారని, యువతకు అండగా ఉండాలనే ఉద్దేశంతో 2002లో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక వ్యవస్థాపకుల్లో ఒకరిగా కీలకపాత్ర పోషించారు. ఆ వేదిక ద్వారా అనేక విద్యా, వైజ్ఞానిక సదస్సులు నిర్వహించడం, విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించారు. అంతటితో ఆగకుండా యువతకు ఉద్యోగావకాశాలకు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయాలని భావించి నీలావతి గ్రామంలో ఏర్పాటు చేశారు. స్థలం సేకరించి, నిర్మాణానికి విరాళాల కోసం విస్తృతంగా గ్రామాల్లో పర్యటించారు. ఉద్దాన ప్రాంతంలో వృద్ధుల నుంచి యువత వరకు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ పిట్టల్లా రాలిపోతున్నారని చలించిపోయి 2016లో ఉద్దాన ప్రాంత ఆరోగ్య పరిరక్షణ కమిటీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. కిడ్నీ రోగులు వద్దకు వెళ్ళి వారి సమస్యలను తెలుసుకున్నారు. కిడ్నీ రోగులపై ప్రభుత్వాల నిర్లక్ష్యంపై రోగుల పక్షాన పోరాటం చేశారు. ఉద్దాన ప్రాంతంలో రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తూ ఉద్దాన జీవనాధారమైన జీడికి మద్దతు ధర ప్రకటించాలని జీడి రైతుసంఘం చేపడుతున్న ఉద్యమంలో భాగస్వామ్యమై జీడి రైతులకు అండగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ గ్రీన్ ఆర్మీ సంస్థ స్థాపించి మొక్కలను పంపిణీ చేస్తున్నారని తెలుసుకుని, ఆ సంస్థలో చేరి మరింత విస్తృతంగా గ్రామాల్లో పర్యటించి ప్రముఖుల పుట్టినరోజు, వివాహ కార్యక్రమాలు, పండగ రోజులు ఇలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి మొక్కల పంపిణీ చేపట్టడంలో కీలకపాత్ర పోషించారు.

2018 అక్టోబరులో సంభవించిన తిత్లీ తుపాను ధాటికి ఉద్దాన ప్రాంతం అతలాకుతలమైంది. జీడి, కొబ్బరి చెట్లు పూర్తిగా నాశనం కావడంతో ఉద్దాన ప్రాంత రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి గ్రామాల్లో సదస్సులు, సమావేశాలు నిర్వహించి వారిలో పోరాట చైతన్యం కల్పించారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పోరాటాల్లో పాల్గొన్నారు. జీడి కార్మికులకు యాజమాన్యం వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదని, జీడి కార్మికులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో కాష్యూ లేబర్ అసోసియేషన్ సంఘాన్ని ఏర్పాటులో ప్రధాన పాత్ర పోషించారు. పలాస పట్టణంలో జీడి పరిశ్రమల కాలుష్యం సమస్యపై దశాబ్దపు కాలం పాటు సాగిన ఉద్యమంలో సిటిజన్స్ ఫోరం తరుపున కీలకపాత్ర పోషించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఏర్పాటు చేయడంలోనే కాక ఐక్యవేదిక ఆధ్వర్యాన ప్రజా సమస్యలపై పోరాటంలో అగ్రభాగాన నిలిచారు. భౌతికంగా ఆయన లేకపోయినా ఉద్దాన ప్రాంతంలో ఉద్యమ స్ఫూర్తి రూపంలో ప్రజల మనసుల్లో చిరకాలం నిలిచే ఉంటారు.

రైతు ఉద్యమాలకు

ఓంకార్ సహకారం మరువలేనిది

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు



ప్రజాశక్తి- పలాస

ఓంకార్ విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐలో చేరి విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు అన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఆ పోరాటాలను మరింత విస్తృత పరుస్తూ విద్యార్థి, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడేవారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓంకార్‌తో నాకు పరిచయం ఏర్పడి ఆయనతో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నానని గుర్తు చేశారు. ఆయన పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిబద్ధతతో పని చేసేవారని చెప్పారు. ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనా ఆయన ప్రవృత్తి కళాకారుడని అన్నారు. ఎక్కడ ఉద్యమాలు జరిగినా వాటిలో పాల్గొంటూ డప్పుకొడుతూ, పాటలు పాడేవారు. తన ఆట, పాట ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజా సమస్యలపై జనాన్ని కదిలించేవారని అన్నారు. నిరంతరం నవ్వుతూ, గలగల మాట్లాడే ఓంకార్ మాస్టారు కామ్రేడ్‌గా అందరికీ సుపరిచితులేని తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి ప్రబలినప్పుడు ఈ వ్యాధి మూలాలను తెలుసుకోవాలని, వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామ గ్రామాన తిరుగుతూ ఆ సమస్యపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఉద్దానం అభివృద్ధి వేదికను ఏర్పాటు చేసి దానిని నడపడంలో ఆయన ముందున్నారని అన్నారు. ఉద్దానం వెనుకబాటుకు విద్య లేకపోవడమే కారణమని ఉద్దానం విద్యావేదిక ద్వారా చదువు అవసరాన్ని చాటిచెబుతూ అనేక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. గ్రంథాలయం ఏర్పాటుకు ఆయన కృషి చేశారని అన్నారు. సిపిఎం సభ్యునిగా సమావేశాల్లో ఈ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం పార్టీ దృష్టికి తీసుకొస్తూ... వాటి పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. ఉద్దానం ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించాలని, జీడిపంటకు గిట్టుబాటు ధర ప్రకటించాలని జరిగిన పోరాటాల్లో ఆయన అనారోగ్యాన్ని సహితం లెక్కచేయకుండా పాల్గొనేవారని గుర్తు చేశారు. పలాసలో నివాస ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న కాలుష్యం, పర్యావరణం సమస్యలపై ఆయన ప్రత్యక్షంగా ఆందోళన నడిపారని అన్నారు. ఆ సందర్భంలో కేసులు సైతం లెక్క చేయలేదన్నారు. పలాసలో సిపిఎం ప్రజాసంఘాలకు ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆయన చిరకాల కోరికని అన్నారు. దానికోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యాలయ నిర్మాణం ప్రారంభించాలని, అందుకు అవసరమైన వనరుల సమీకరణ కోసం నిరంతరం చర్చిస్తుండేవారని చెప్పారు. ఓంకార్ మాస్టార్ క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత, లక్ష్యసాధన కోసం అలుపెరుగని పోరాటం ఆయన సొంతమని అన్నారు. రైతాంగ సమస్యలపై జరిగే పోరాటాలకు ఆయన సహకారం మాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఆయన ఉద్యమ ప్రస్థానం ప్రారంభం నుంచి నేటివరకు ఆయనతో కలిసి పనిచేసే అవకాశం కలిగిందన్నారు. అందరివాడిగా గుర్తింపు పొందిన ఓంకార్ మృతి ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నేత ఓంకార్ దృశ్యమాలిక































ఓంకార్ ఆశయసాధనకు కృషి



ప్రజాశక్తి – పలాస

ఓంకార్ మాస్టార్‌తో ప్రజా ఉద్యమాలు సందర్భంగానే పరిచయం ఏర్పడింది. నా కంటే ముందే ఆయనకి ఉద్యమాలతో సంబంధం ఉంది. ఆయనకు అప్పగించిన భాధ్యతను నిబద్ధతతో అమలు చేసే వ్యక్తి. అందులో భాగంగానే పట్టణ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యాన పొల్యూషన్‌కు, జనావాసాల్లో సెల్ టవర్లు నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. 15 ఏళ్లు ఆయనతో కలిసి ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహణలో ఒకరికి ఒకరం చేదోడు వాదోడుగా ఉండేవారు. ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. ఆయన ఆశయాలు సాధనకు బలమైన వర్గపోరాటం నిర్మించడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి.

- ఎన్.గణపతిరావు, సిపిఎం నాయకులు



















